

స్వాతంత్ర్య వేడుకల ముందస్తు ఏర్పాట్లు పరిశీలన

కడప : 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో జాయింట్ కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలసి స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో ప్రోటోకాల్ అనుసరించి సీటింగ్, స్టేజ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం వంటివి పటిష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డయాస్‌పై సీటింగ్ ఏర్పాట్లు పరిశీలించారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసే స్టాల్స్‌ను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసులు, విద్యార్థుల బృందం నిర్వహించిన రిహార్సల్స్‌ను ఆయన పరిశీలించారు. 15న జరగనున్న స్వాతంత్ర వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు.

చీనీ ధరలు పతనం

- ఆందోళనలో రైతన్నలు
- సూట్ పేరుతో మోసం
- ఈ సీజన్‌కైనా పులివెందులలో మార్కెట్ ప్రారంభమయ్యేనా?

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది సీజన్‌లో చీనీ కాయల ధరలు అమాంతంగా తగ్గిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చీనీ తోటలు పెంపకానికి ప్రసిద్ధి. ఈ మండలంలో దాదాపు 8 వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. ప్రతి ఏడాదీ ఈ సీజన్‌లో దాదాపు 80 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ధరలు గణనీయంగా పడిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం, బెంగళూరు మార్కెట్లలో టన్ను ధర రూ. 20 వేల నుంచి రూ. 25 వేల లోపే ధరల్లో పలుకుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ధరలకు చీనీకాయలు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడులు సైతం రావని రైతులు ఆవేదన చెందుతున్నారు.



పులివెందుల మార్కెట్‌పై రైతుల ఆశలు

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో గత ఏడాది చీనీకాయల మార్కెట్ అటహాసంగా ప్రారంభించారు. అనతి కాలంలోనే రైతులకు సరైన ధరలు లభించకపోవడంతో తమ ఉత్పత్తులను తీసుకెళ్లకపోవడంతో మార్కెట్‌లో వ్యాపారాలు నిలిచిపోయాయి. ఈ ఏడాది లోకల్ వ్యాపారులను కాకుండా ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి వారిచేత చీని కాయలు కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సూట్ పేరుతో మోసపోతున్న రైతులు

రైతులు తమ తోటల వద్ద చీనీ కాయలు విక్రయించాలంటే ప్రతి పది టన్నులకు 2.5 టన్నులు సూటు పేరుతో ఉచితంగా వ్యాపారులకు ఇవ్వాల్సి వస్తుంది. ఈ సూట్‌ను నియంత్రించడానికి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు సూటు నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సూట్ నియంత్రించేలా చర్యలు చేపట్టాలి

అధికారులు, రాజకీయ నాయకులు చీనీ కాయల కొనుగోలులో సూట్ నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి. సూటు పేరుతో వ్యాపారులు మోసం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

-గంగాధర్ రెడ్డి, చీనీ రైతు, గురజాల.

కనీస మద్దతు ధర ప్రకటించాలి

టన్ను చీనీ కాయలు కనీసం మద్దతు ధర రూ. 50 వేలు ప్రకటించాలి. దీంతో పెట్టుబడులు పోను కొంతమేర ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. కావున ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

-గోపాల్‌రెడ్డి, చీని రైతు, గురజాల.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా...

ప్రస్తుతం మార్కెట్లో చీనీ కాయలు ధరలు తక్కువగా ఉన్నాయి. అదేవిధంగా కొనుగోలులో సూట్‌ను నియంత్రించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలాగా చూస్తా.

-మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి, ముద్దనూరు.

ఉత్తమ వైద్య కళాశాలగా తీర్చిదిద్దుతా

- ఈ ఏడాది నుంచి అదనపు పీజీ కోర్సులు
- ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు అనుమతి
- ఒకటి నుంచి యుజి, ఐదు నుంచి పీజీ తరగతులు
- జిజిహెచ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ వెల్లడి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిజిహెచ్ వైద్యకళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ఆధునిక కోర్సులకు అనుమతి మొదలు ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, పెరిగిన మెడికల్ సీట్ల నేపథ్యంలో జిజిహెచ్ వైద్యకళాశాల అభ్యున్నతికి నిదర్శనం. దీంతోపాటు వైద్యవిద్యార్థుల బోధన, బోధనేతర అవ సరాలు, వసతి సదుపాయాల కల్పనపై దృష్టి సారించాం. వైద్య ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన విధానాలను అమలు చేయడంపై దృష్టి సారిస్తాం. ఫలితంగా నిపుణులైన వైద్యనిపుణులను అం దించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. 2006లో రిమ్స్ పేరుతో ఏర్పా టైన వైద్య కళాశాల అంచెలంచెలుగా కోర్సులను, ప్రమాణాలను పెంచుకుంటూ ఎదుగుతున్న క్రమాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్న జిజిహెచ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖతో ప్రజాశక్తి ముఖాముఖి.

యుజి, పీజీ కోర్సుల వివరాలు తెలపండి?

ప్రభుత్వ జనరల్ వైద్య కళాశాలలో ఇడబ్ల్యుఎస్ కోటాను అమలు చేసిన నేపథ్యంలో 2023-24 అకడమిక్ ఇయర్‌లో 175 ఎంబిబిఎస్, 113 పిజీ సీట్లు ఉన్నాయి.

కొత్త కోర్సుల అమలుపై మాట్లాడండి?

2023-24 అకడమిక్‌ఇయర్‌లో 11 కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నాం. ఈమేరకు లెటర్ ఆఫ్ పర్మిషన్ లభించింది. ఇందులో ప్రధానంగా బయోకెమిస్ట్రీ, పాథాలజీ, ఫర్మకాలజీ, ఎస్‌పిఎం, ఫోరెన్సిక్ మెడిసిన్, ఫల్మనరీ మెడిసిన్, రేడియోలజీ, సైక్రియాట్రీ, రేడియో ఆంకాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

యుజి, పీజీ తరగతులు ప్రారంభమెప్పుడు?

జిజిహెచ్ వైద్యకళాశాలలో సెప్టెంబర్ ఒకటి నుంచి ఎంబి బిఎస్, ఐదు నుంచి పీజీకోర్సులను తరగతులను ప్రారంభించనున్నాం. ఈమేరకు అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడమైంది.

ఆధునిక పరికరాల ఏర్పాటు గురించి చెప్పండి?

జిజిహెచ్ వైద్య కళాశాలకు కొత్త కోర్సుల అమలు నేపథ్యంలో డిసెంబర్ నాటికి ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయనున్నాం. ఇందులోభాగంగా బ్రాచిథెరఫీ, టెలిథెరఫీ, రేడియేషన్ సాఫ్ట్ పరికరం, సైరోమీటర్, లైట్‌సోర్స్, ఫ్లోరో స్కోపీ యూనిట్, మెమోగ్రఫీ డిజిటల్ యూనిట్ మొదలగు పలు ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయనున్నాం.

వైద్యకళాశాల అభివృద్ధిపై మాట్లాడండి?

జిజిహెచ్ వైద్యకళాశాలలో 11 కొత్త కోర్సులకు అనుమతి లభించడం మొదలుకుని సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్‌కేర్, సైక్రియాట్రీ బ్లాకుల నిర్మాణంతో 130 బెడ్స్ అందుబాటులోకి రానున్నాయి. దీంతోపాటు 160 మంది వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వసతి సదుపాయాల గురించి తెలపండి?

జిజిహెచ్ విద్యార్థులకు కొత్త రెసిడెన్సియల్ హాస్టల్‌లో వసతి సదుపాయాల కల్పనపై దృష్టి సారించడమైంది. మూడవ ఫ్లోర్ లోని మూడు దశలుగా 21 గదుల చొప్పున 63 గదుల్లో వసతి సదు పాయాలను కల్పించడమైంది.

గండికోటకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి- కడప అర్బన్



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించిన అతిథులు

హోటల్ ఒబెరాయ్‌తో గండికోటకు అంతర్జాతీయ స్థాయి లభించనుందని, డాక్టర్ వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గండికోటలో హరిత హోటల్ నిర్మించి పర్యాటకంగా అభివృద్ధి చేశారని, ప్రస్తుతం ఆయన కుమారుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్కడ ఒబెరాయ్ హోటల్ నిర్మింపజేసి ఆ ప్రాంతానికి విశ్వవ్యాప్తంగా ప్రచారం కల్పిస్తున్నారని గండికోట వారసత్వ అభివృద్ధి ప్రాధికార సంస్థ చైర్మన్ పెమ్మసాని ప్రభాకర్ నాయుడు అన్నారు. 'జిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి' అనే అంశంపై ఆదివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఆధ్వర్యంలో స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్‌లో చర్చా వేదిక నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ గండికోటకు ఒకటి చేస్తే అది పదింతల సాయం చేస్తుందని ప్రజల్లో నమ్మకం ఉందని చెప్పార గండికోట అభివృద్ధిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతున్నారు. జిలా బిసి సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ కలెక్టర్ గండికోటతో పాటు జిల్లా పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లా పర్యాటక రంగాన్ని డాక్యుమెంటేషన్ చేసేందుకు తమ వంతు సహకారం అందించగలమన్నారు. పర్యాటక అభిమానులు ముడియం కిషోర్, ఎల్లేశ్వరరావు, గంగాధర్, కె.వి. రమణారెడ్డి, సిహెచ్. వెంకటేష్, మునికుమార్ తదితరులు పర్యాటక ప్రాంతాలపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ గా ఎంపికైన కె. చిన్నపరెడ్డిని, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షునిగా ఎన్నికైన పోతుల వెంకటరామిరెడ్డిని ముఖ్య అతిథి పెమ్మసాని ప్రభాకర్ నాయుడు తమ సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీతలు మాట్లాడుతూ జిల్లాలోని లంకమల అడవి ప్రాంతానికి పర్యాటకంగా గల ప్రాధాన్యతను వెలుగులోకి తెచ్చేందుకు కృషిచేస్తామన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు వి. గౌరి శంకర్, దేవతి రవీంద్రనాథ్, బోగాల కొండారెడ్డిలను కూడా అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో సూరిబాబు, ఎం.వి. రమణారెడ్డి, నారాయణ రాజు పాల్గొన్నారు.

నగరంలో 3 కె రన్ విజయవంతం

ప్రజాశక్తి - కడప



3కె రన్ ప్రారంభోత్సవంలో క్రీడాకారులు

ఈనెల 16 నుంచి వైజాగ్ లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి ఏసీఎస్ స్టేడియంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఎపి ఎల్) సీజన్ - 2 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలో 3కే రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. 3కే రన్‌ను ఏసి ఏ సౌత్ జోన్ కన్వీనర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. మ్యాచ్ లను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎం. సాయి పృధ్వితేజ్, ఉమెన్ కో-ఆర్డినేటర్ విష్ణు మోహన్ రావు, మాజీ కార్యదర్శి పి. సంజయ్ కుమార్‌రెడ్డి, ఎసిఎ సౌత్ జోన్ అకాడమీ సిబ్బంది, క్రీడాకారులు, కోస్టల్ రైడర్స్ టీం కోచ్ పైడికాల్వ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

శతాధిక గ్రంథకర్త డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస్

కడప అర్బన్ : వృత్తిరీత్యా ఐఎఎస్ అధికారి అయినప్పటికీ, పరిశోధన ప్రవృత్తిగా కలిగి తెలుగులోను, ఆంగ్లంలోను వందకు పైగా రచనలు చేసిన బహుముఖ ప్రతిభాశాలి డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస్ అని సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆదివారం ఉదయం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస్ 90వ జయంతిని నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత సంచాలకులు మాట్లాడుతూ వేదవ్యాస్ గొప్ప ఉపన్యాసకులని, ఆధ్యాత్మిక పరిశోధకులని, యోగ, ఆధ్యాత్మిక గురువని అన్నారు. ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 'మహా భారత యుద్ధం ఖగోళ కాల నిర్ణయం' అనే అంశంపై సంస్కృతంలో పరిశోధన చేశారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ భారతీయ ధర్మం ప్రతి ఒక్క విద్యార్థి అర్థంతో సహా విద్యాభ్యాసంలో భాగంగా నేర్చుకోవాలని, భారత దేశ ఔన్నత్యాన్ని తిరిగి నిలబెట్టాలనేది వేదవ్యాస్ జీవితాశయమన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

త్వరలో కడపలో రాష్ట్ర జడ్‌పి చైర్మన్ల సమావేశం

జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప ప్రతినిధి



జడ్‌పి చైర్మన్‌ను సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయ సభాభవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు రెండు కళ్ల లాంటి వారన్నారు. త్వరలో రాష్ట్రంలోని 13 జిల్లాల జడ్‌పి చైర్మన్ల సమావేశాన్ని నిర్వహిస్తామని, చైర్మన్లందరూ కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అంతకు మునుపు సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉంటారన్నారు. ఇందులో భాగంగానే జడ్‌పి కారుణ్య నియామకాలు మొదలు జీతాల చెల్లింపుల సమస్యల ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కరోనా మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొని దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, బసిరెడ్డితోపాటు బాలుడు, సురేష్, చంద్ర, సోమశేఖర్ సహా రాష్ట్రంలోని వందలాది మంది నాయకులు, ఉద్యోగులు పాల్గన్నారు.

శ్రీనివాసరెడ్డిపై కేసు దుర్మార్గం

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న అమీర్‌బాబు

పుంగనూరు సంఘటనలో లేకున్నా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి పై కేసులు పెడుతూ వైసిపి తన రాక్షసత్వాన్ని నిరూపి ంచుకుంటున్నదని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్ అమీర్ బాబు విమర్శించారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల పరిశీలనలో ప్రజల నుంచి పార్టీ అధినేత చంద్రబాబుకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అసహనం పెరిగి వైసిపి నేతలు అంగళ్లు, పుంగనూరులలో వారే దాడులు చేసి కొందరు పోలీసు అధికారులను లొంగదీసుకొని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుపైనా , ఆర్.శ్రీనివాసరెడ్డి సహా ఇతర ముఖ్య నేతలపైనా కేసులు నమోదు చేయించడం పిరికి పంద చర్య అన్నారు. వైసిపి విధ్వంసకర చర్యల అనంతరం దాడులలో గాయపడ్డ వారిని, అక్రమ కేసులకు గురైన వారిని పరామర్శించేందుకు వెళ్లిన వాసుపై కూడా కేసు పెట్టడం వైసిపి నీచ రాజకీయమని అన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు షేక్. రహమతుల్లా, నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెస్ టోర్నమెంట్‌లో లక్ష్మీ మనుశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి - కడప



బెంగుళూరు రూరల్ జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయస్థాయి ఆన్లైన్ చెస్ టోర్నమెంట్ లో అండర్-9 బాలికల విభాగంలో కడప నగరానికి చెందిన లక్ష్మి మను శ్రీ అద్భుతంగా రాణించి ఐదవ స్థానంలో నిలిచింది. www.chess.com లో నిర్వహించిన ఈ టోర్నమెంట్లో 204 మంది చెస్ క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పోటీపడ్డారు. 10 రౌండ్లకు 4 పాయింట్లు సాధించి లక్ష్మి బహుమతిని సాధించింది. కడప నగరానికి చెందిన తేజోమయి, ఖ్యాతి మై, స్పందన, చరిత్, భద్ర, గుడవర్ధన్, ప్రణవ్ కూడా టోర్నమెంట్ లో పాల్గొని రాణించారని వైయస్సార్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - కడప అర్బన్



నృత్యం చేస్తున్న యువకులు

నగరంలోని శిల్పారామంలో సాంస్కృతి కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం మిస్పా మూవీ కరుణాకర్ ఆధ్వర్యంలో చిత్తూరుకు చెందిన కళా బృందం వారు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఏవో శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతోనే మహిళలకు భరోసా

ప్రజాశక్తి - కడప అర్బన్

చంద్రబాబు పాలనతోనే మహిళలకు భరోసా ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 12వ డివిజన్ అర్‌టిసి కాలనీ, కృష్ణదేవర కాలనీ, ఎస్‌టి వీధులలో 'మహిళల భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి 'అనే పథకాలతో ఆదివారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ వాణిజ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీకి మహిళలు బ్రహ్మరథం పట్టి గెలిపిస్తారన్నారు. నారా చంద్రబాబు నాయుడు పాలనతోనే రాష్ట్రంలోని మహిళలకు భరోసా కలుగుతుందన్నారు. నారా చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచి, ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి సానపురెడ్డి శకుంతలమ్మ, నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు సునీత, నగర్ ప్రధాన కార్యదర్శి కుమార్ యా దవ్, నగర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు పేయ్యల ప్రణవతి, ప్రేమకుమార్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

మణిపూర్ లో శాంతియుత వాతావరణం ఏర్పడాలని అక్కడి ప్రజలు మళ్ళీ సాధారణ ప్రజా జీవితం గడపాలని పోరుమామిళ్ల ఆర్‌సి ఎమ్ చర్చి రెవ. ఫాదర్ జాలా విజయ భాస్కర్ అన్నారు. పోరుమామిళ్లలోని ఆర్‌సిఎం చర్చి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనేక ప్రజా సంఘాలు నల్లమాస్క్ ధరించి, మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని, మణిపూర్‌లో శాంతి నెల కొల్పాలని, పిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మానవహారంలో అనేక ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ నాయకులు ఓబుళాపురం శోభన్ కుమార్, ఎస్‌సి మాజీ కమిషన్ జాతీయ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పిఎం కమలమ్మ, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, సిపిఐ నాయకులు పిడుగు మస్తాన్, రవి, సిపిఎం నాయకులు భైరవ ప్రసాద్, హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు పణీరావు, ఎస్‌టియు ల్లా అధ్యక్షులు పి. రమణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక రాష్ట్ర సంక్షేమ కార్యదర్శి వద్దేపోగు యోహాను, లాకా చంద్రశేఖర్, ఫాదర్లు, పాస్టర్లు, ముస్లిమ్ మైనార్టీలు ఖాదర్ బాష, యూటి ఎఫ్ నాయకులు కుర్రా చెన్నయ్య, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ అన్వర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. **కలసపాడు :** మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న హింసాత్మక చర్యలను ఆపి శాంతియుత వాతావరణం కల్పించాలని మండల ఆర్‌సిఎంచర్చి ఫాదర్ కొత్తపల్లి మనోహర్ అన్నారు. ఆదివారం ప్రార్థన అనంతరం కతోలికా క్రైస్తవులతో మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా అన్ని వర్గాల వారు శాంతియుతంగా కలిసిమెలిసి ఉండాలని అన్నారు. సోదర భావంతో సమైక్యత భావంతో కలిసిమెలిసి ఉంటే దేనినైనా సాధించవచ్చు అని ఆయన అన్నారు.

చేనేత కార్మికులను సత్కరించుకోవడం హర్షణీయం

ప్రజాశక్తి- కడప అర్బన్

చేనేత కుటుంబంలో పుట్టిన తాము వారిని సత్కరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని చౌడం బ్రదర్స్ పేర్కొన్నారు. ఆదివారం విజయనగర్ కాలనీలోని తమ నివాసంలో వివిధ కారణాలవల్ల జాతీయచేనేత దినోత్సవవేడుకలకు హాజరు కాలేని చేనేత కార్మికులను సత్కరించారు. శాలువా, జ్ఞాపిక, లామినేషన్‌తో కూడిన ప్రశంసా పత్రాన్ని బహుకరించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ నాగార్జున, చౌడం లక్ష్మీదేవి మల్లీశ్వరి, శారద, విజయ,శివ సాయి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

18న రాష్ట్ర స్థాయి ఉక్కు సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు సాధన కోసం కడప ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో డివైఎఫ్ఐ యువజన సంఘం జిల్లా కమిటీ అధ్వర్యంలో ఈనెల 18న రాష్ట్ర స్థాయి ఉక్కు సదస్సు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ తెలిపారు. ఉక్కు సదస్సు పోస్టర్లు ఆదివారం స్థానిక జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పైన కేంద్ర ప్రభుత్వం సీత కన్ను వేసింది అన్నారు. ఇక్కడి ప్రాంత యువత భవిష్యత్ కడప ఉక్కు అన్నారు. యువతకు భవిత కోసం కడప ఉక్కే ఏకైక పరిష్కారం అన్నారు. కడప ఉక్కును ఆంధ్రుల హక్కుగా కడప వేదికగా డివైఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతుందని చెప్పారు. ఈనెల18 న కడప యుటిఎఫ్ భవన్ లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తారని చెప్పారు. ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్.గేయానంద్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బి.నారాయణ, మాజీ డివైఎఫ్ఐ నాయకులు జి.చంద్రశేఖర్ హాజరు అవుతున్నారన్నారు. సదస్సుకు కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం. ఓబులేసు, నగర ఉపాధ్యక్షులు విజయ్, జగదీష్ పాల్గొన్నారు.

ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మేసా ప్రసాద్

ప్రజాశక్తి - కడప సిటీ



మేసా ప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఏపీ మెడికల్ అండ్ హెల్త్ (YSRTUC) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యవర్గ ఎన్నికల్లో వైఎస్ఆర్ జిల్లాకు చెందిన మేసా ప్రసాద్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా కాకర్ల వెంకటరామిరెడ్డిని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర అధ్యక్షులు వెంగల్‌రెడ్డి వైయస్సార్ జిల్లా అధ్యక్షులు వివిఎస్. మునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.చంద్రమోహన్, యూనియన్ నాయకులు వల్లి భాష,నాగరాజు , మహదేవ్ యాదవ్ , ఆంజనేయ వరప్రసాద్ , ఖాదర్ భాషా , విశ్వనాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లె రవి, రవీంద్ర , జేష్టకుమార్, భాస్కర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడప : ఈనెల 14న మూల వంక 132 కెవి సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా రిమ్స్ ప్రభుత్వ హాస్పిటల్, ఐటీ పార్కు, మూలవంక, చిన్నకాంపల్లి, నాగిరెడ్డిపల్లి, కృష్ణాపురం, తెలుగు గంగ ప్రాజెక్టు కాలనీ 33/11 కెవి సబ్ స్టేషన్ల పరిధి ప్రాంతాలలో ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రూరల్ సబ్ డివిజన్ అధికారి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీకృష్ణదేవ ఒక ప్రకటనలో తెలిపారు. పైన పేర్కొన్న ప్రాంతాలల్లో వినియోగదారులు గమనించాలని కోరారు.

ధరలు పెరిగే కొద్దీ వేతనాలు తగ్గుతున్నాయి

బద్వేలు : నిత్యావసర సరుకుల ధరలు పెరిగే కొద్దీ అంగన్వాడీల వేతనాలు తగ్గుతున్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక గాయత్రి కళాశాలలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు. అనుబంధం) బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన కోసం పనిచేసే ప్రభుత్వాల కోసం పని చేయాలని, అంగన్వాడీలకు గ్రాట్యుటీ చెల్లించాలని సుప్రీంకోర్టు చెప్పినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేయడం లేదన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను రిక్రూట్ చేసిన ప్రభుత్వానికి జీతాల బాధ్యత లేదా అని ప్రశ్నించారు. అంగన్వాడీ ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు వారిపైనే కక్షపూరితంగా వేధిస్తున్నాయన్నారు. ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్వాడీ సమస్యల పరిష్కారం సిఐటియు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, స్థానిక నాయకులు హుస్సేన్నమ్మ, సుభాషిని, జయప్రద, లక్ష్మీనరసమ్మ, రవణమ్మ, విజయమ్మ, సీ.ఎం.కుమారి, రమాదేవి, రత్న, నాయకులు రాజు పాల్గొన్నారు.


జిల్లా కార్యదర్శి దస్తగిరిని సన్మానిస్తున్న నాయకులు

దూదేకుల సంఘం జిల్లా కార్యదర్శిగా రాయపాటి దస్తగిరి

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని కోనాపురం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ రాయపాటి దస్తగిరి దూదేకుల సంఘం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. పులివెందులలోని దూదేకుల నూర్ బాషా సంఘం కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆ మేరకు నియామక పత్రం అందజేసినట్లు దస్తగిరి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దూదేకుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దూదేకుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియమించిన జిల్లా, రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సరితల ఫక్రుద్దీన్, గంగులు, బాబు, సంపత్, బైలర్ సంఘం అధ్యక్షుడు బాదులు పాల్గొన్నారు.

ప్రతి పంటను నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్‌లో సాగయ్యే పంటలను తప్పనిసరిగా ఇ క్రాప్ చేయించాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ తెలిపారు. ప్రతి రైతు తన పొలంలో పంట సాగు చేసిన వెంటనే తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులకు తెలిపి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకోవడం వలన రైతులు పంట బీమా, పంట మద్దతు ధర, ఇన్ పుట్ సబ్సిడీ, రైతు భరోసా వంటి పథకాలకు అర్హులవుతారని చెప్పారు. కావున ప్రతి గ్రామంలో రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. గతంలో సాగు చేసిన పంటలు తుఫాను తాకిడికి దెబ్బతిన్నప్పటికీ రైతులు ఇ క్రాప్ నమోదు చేసుకోకపోవడంతో నష్ట పరిహారం మంజూరుకాలేదన్నారు.

మానవత్వం చాటుకున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్

- అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఒకే రోజు ప్రొద్దుటూరులో ఆదివారం రెండు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించి 'మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్' మానవత్వం చాటుకుంది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మదురు వెంకటరమణ మృతి చెందారు. బంధువులు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది శివకుమార్ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీకాంతోను ఫోన్ ద్వారా సంప్రదించారు. ఆయన స్పందించి ప్రొద్దుటూరు హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక గరుడాద్రి నగర్‌లో ఉంటున్న మనోహర్‌రెడ్డి అనే మరో అనాథ మృతి చెందగా అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సిజ్జ మల్లికార్జున, సుబ్బయ్య, సాయి, శివనారాయణ పాల్గొన్నారు.

వైసిపిపై ఆరోపణలు చేయడం సరికాదు

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ సర్పంచ ఎన్నికపై టిడిపి నాయకులు వైసిపిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని రాయలసీమ కాపునాడు యువజన సంఘం అధ్యక్షుడు కావలి కృష్ణతేజ అన్నారు. ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ పత్రంలో ఓటరు జాబితాలో ఉన్న సీరియల్ నెంబర్ కాకుండా తప్పుగా వేసి నామినేషన్ వేయడంతో టిడిపి వారే చేసుకున్నారని అన్నారు. అవకాశం ఉన్న వాటిపై దృష్టి పెట్టకుండా వైసిపిని తిట్టేందుకే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. వైసిపిని గెలవకుండా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వార్డు మెంబరు నామినేషన్‌కు వేయడానికి టిడిపి వారికి కార్యకర్త దొరక్కపోవడంతో సర్పంచకు మాత్రమే నామినేషన్ వేశారని అన్నారు. తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. 2014 టిడిపి హయాంలో కూడా ఇడుపులపాయ సర్పంచ పదవిని టిడిపి నాయకులు కైవసం చేసుకోలేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో చాలామంది టిడిపి నాయకులు లబ్ధి పొందారని, ఆ విషయాన్ని కూడా గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. సమావేశంలో ఇడుపులపాయ వైసిపి నాయకులు పుల్లయ్య, హరి, గోపి, శ్రావణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కావలి కృష్ణతేజ

ముగిసిన రామాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో ఉన్న శ్రీ సీతారాముల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ప్రతిరోజు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


ఏర్పాటు చేస్తున్న మట్టిరోడ్డు

ఎట్టకేలకు మట్టి రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో వర్షపు నిలవకుండా మట్టితో రోడ్డు వేస్తున్నారు. ఇక్కడ ఇదివరకే సిమెంట్ రోడ్డు ఉండడంతో దాన్ని ఏమి చేయలేని పరిస్థితుల్లో ఉన్న పంచాయతీ అధికారులు.. అక్కడ మట్టి తోలి రోడ్డును ఎత్తు లేపారు. గతంలో ప్రతిసారి వర్షం వచ్చినప్పుడల్లా మోకాళ్ళ లోతు నీళ్లు నిలుస్తోంది. పాదాచారులు, వాహనాల్లో వెళ్తున్న వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన పంచాయతీ అధికారులు సిమెంట్ రోడ్డును మట్టితో ఎత్తు లేపారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎటిఎం దొంగ అరెస్టు

కలికిరి : ఎటిఎం సెంటర్ల దగ్గర డబ్బులు కాజేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వాల్మీకిపురం సిఐ పి.సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ మాట్లాడుతూ నాలుగు రోజులు క్రితం కలికిరి క్రాస్‌రోడ్ ఎటిఎం వద్ద ఇద్దరు వృద్ధులు డబ్బులు తీసుకుంటున్న సమయంలో సదుం మండలం బత్తలవారిపల్లి కు చెందిన ఆటో డ్రైవర్ చింతల మోహన్(28) వారిని ఏమార్చి వారి దగ్గర నుండి ఎటిఎం దొంగిలించి వారి అకౌంట్లో ఉన్న నగదును తీసేవాడని చెప్పారు. బాధితులు కలికిరి పోలీస్ స్టేషన్ ఆశ్రయించగా ఎస్ఐ రహిమల్ల ఆదేశాల మేరకు ఏఎస్ఐ మధు సూదనాచారి కేసు నమోదు చేశారని చెప్పారు. తమ సిబ్బందితో కలికిరిలో తనిఖీ నిర్వహిస్తుండగా శనివారం మధ్యాహ్నం కలకడ రోడ్డు లోని సాయి బాలాజీ కాలనీ సమీపంలో ఆటోలో అను మానంగా ఉన్న వ్యక్తిని విచారించగా నిందితుడిగా తేలడంతో అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.42 వేల రూపాయలు నగదు, ఆంధ్ర బ్యాంక్ ఎటిఎం కార్డు, ఒక కీప్యాడ్, లావా ఫోను, వెండిచైన్లు రెండు బ్రాస్లెట్ రెండు, వెండి ఉంగరము, బంగారు చెవి పోగులు ఒక జత తో పాటు ఆటోను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు తెలిపారు. దొంగతనాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి అను మానం ఉన్న పోలీసులు తెలపాలన్నారు.

ప్రతి నీటిబొట్టు నిల్వలో హిమకుంట్ల ఆదర్శం

గ్రామం చుట్టూ 52 చెక్ డ్యాంలు.. సమృద్ధిగా పెరిగిన భూగర్భజలాలు


నల్లవంక చెక్ డ్యాంలో నిలువ ఉన్న నీరు


చెరువు వంక చెక్ డ్యాం నుంచి పొంగి ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కరువు ప్రాంతమైన రాయలసీమలో ప్రతి నీటిబొట్టును నిలువ చేసి సమృద్ధిగా భూగర్భ జలాలను పెంచిన గ్రామంగా హిమకుంట్ల ఆదర్శంగా నిలుస్తోంది. మండలంలోని హిమకుంట్ల గ్రామంలో 2016 నుంచి 2019 వరకు గ్రామం చుట్టూ చెక్ డాంలు ఏర్పాటు చేశారు. దాదాపు రూ.8 కోట్ల వ్యయంతో చింతమాను వంక, చెరువు వంక, చర్లపల్లి వంక, నల్ల వంకలలో 52 చెక్ డ్యాంలు నిర్మించారు. చీని తదితర పండ్ల తోటలకు సింహాద్రిపురం మండలం ప్రసిద్ధి. 2016 నుంచి 2019 మధ్యకాలంలో తీవ్ర వర్షాభావంతో బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ పరిస్థితుల్లో రైతుల కష్టాలు వర్ణనాతీతం. తమ చీని తోటలను రక్షించుకునేందుకు రైతులు ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీటి తడులు అందించారు. అప్పట్లో వెయ్యి అడుగుల లోతు బోరుబావి వేసినా చుక్క నీరు కనపడని పరిస్థితి. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలను గణనీయంగా పెంచేందుకు అప్పటి జడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రణాళికను రూపొందించారు. ఆ మేరకు గ్రామం చుట్టూ నీటి నిల్వకు అవసరమైన ప్రదేశాలను ఎంపిక చేశారు. వంకల వెంబడి నీరు నిల్వ ఉండేలా చెక్ డ్యాంలు నిర్మించారు. వర్షాకాలంలో వానలు సమృద్ధిగా పడినప్పుడు నీరు వృథాగా పోకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం గ్రామం చుట్టూ నీరు నిల్వ ఉండడంతో భూగర్భ జలాలు బాగా పెరిగాయి.

200 అడుగులలోపే బోర్లలో నీరు

గతంలో వెయ్యి అడుగుల బోరు వేసినా నీటి జాడా కనిపించేది కాదు. అయితే ప్రస్తుతం గ్రామం చుట్టూ 200 అడుగు లోపు బోర్లలోనే నీరు సమృద్ధిగా వస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం చెక్ డ్యాంలలో ఎక్కడ చూసినా నీరు నిల్వ ఉండడమే.

ప్రతి నీటిబొట్టును ఆదా చేశాం



గ్రామం చుట్టూ చెక్ డ్యాంలు ఏర్పాటు చేసి ప్రతి నీటి బొట్టును ఆదా చేశాం. ఈ కారణంగా నేడు భూగర్భ జలాలు బాగా పెరిగాయి. గతంలో రైతులు నీటి కోసం అనేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి హిమకుంట్ల గ్రామంలో ఎక్కడా లేదు.

- పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి, సింహాద్రిపురం

అక్రమ ప్రాజెక్టుల నిర్మాణాలను అడ్డుకోవాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె



తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం అడ్డుకోవాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోమ్ నగరం తగలబడిపోతుంటే నిరో చక్రవర్తి ఫిడేలు వాయిస్తూ కూర్చున్నట్లుంది సిఎం జగన్ మోహన్‌రెడ్డి వైఖరి అన్నారు. ఎగువ రాష్ట్రమైన తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం కృష్ణా నదిపై శ్రీశైలం రిజర్వాయర్ ఆధారంగా 90 టిఎంఎం సామర్థ్యంతో పోలవరం-రంగారెడ్డి, 30 టిఎంసి సామర్థ్యంతో డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు సామర్థ్యాన్ని 25 టిఎంసి నుండి 40 టిఎంసికి పెంచారన్నారు. 19.60 టిఎంసితో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును శరవేగంగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టులన్నీ అక్రమ ప్రాజెక్టులన్నారు. ఈ ప్రాజెక్టులకు కేంద్ర జలశక్తి సంఘం, కృష్ణానది యాజమాన్య బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అమోదం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో వీటి ప్రస్తావన లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం దౌర్జన్యంగా ప్రాజెక్టులను నిర్మిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టులు పూర్తయితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుగంగ, గాలేరి-నగరి, ఎస్ఆర్‌బిసి, హంద్రీనీవా, వెలుగోడు, నాగార్జున సాగర్, కృష్ణా డెల్టాకు కృష్ణా జలాలు రాక 50 లక్షల ఎకరాలు సాగు భూమి బీడు భూములుగా మారిపోతాయని చెప్పారు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 50 లక్షల సాగు భూమి బీడు భూములుగా మారుతాయన్నారు. తాగునీటి సమస్య తలెత్తుతుందన్నారు. పరిశ్రమలకు నీరు లేక మూత పడుతాయన్నారు. జల విద్యుత్ లేక కరెంటు బిల్లులు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రానికి పెను ప్రమాదం జరుగుతుంటే అధికార వైసిపి గాని, ప్రతిపక్ష టిడిపి, జనసేన, బిజెపి పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. న్యాయ పోరాటం చేసి తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకోవాలని వైసిపి ప్రభుత్వాన్ని తులసిరెడ్డి కోరారు.

మారణహోమాన్ని ఆపి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

ప్రజాశక్తి - ముద్దనూరు

మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని క్రైస్తవ సంఘాల చర్చిల ఫాస్టర్లు కోరారు. చర్చిలు ధ్వంసం చేయడం, క్రైస్వ మహిళలపై జరుగుతున్న మారణహోమాన్ని అరికట్టాలన్నారు. స్థానిక సిఎస్ఐ, సిఎస్ఐ (ఎస్పీజీ), ఆర్‌సిఎం, హెబ్రోన్, మన్నా, బైబిల్ మిషన్ చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఎల్ఎమ్ కాంపౌండ్ నుండి పాత బస్టాండు కూడలి మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. దాడులను అరికట్టేందుకు బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలను నగ్నంగా ఉరేగించి అత్యాచారాలకు పాల్పడిన నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శాంతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రధాని మోడీపై ఉందన్నారు. కార్యక్రమంలో ముద్దనూరు సర్పంచు బోనం సరళ, ఎంపిటిసి జెడి ఇంద్రాణి, పాస్టర్లు రెవరెండ్ దేవసహాయం, సంతోష్, మరియారెడ్డి ప్రభాకర్, స్వామిదాసు, క్రిష్టఫర్, గోపాల్, సిస్టర్లు, సంఘపెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మణిపూర్‌లో మహిళలపై జరిగిన మారణకాండను, ఘర్షణలను నిరసిస్తూ ఎర్రగుంట్ల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రధాన రోడ్లు వెంబడి శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, గ్యాంగ్ రేప్‌నకు పాల్పడిన ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైన విషయం అందరికీ తెలిసిందే. పాస్టర్స్ మాట్లాడుతూ రెండు తెగలకు సంబంధించి జరిగిన మరణకాండ దారుణమన్నారు. వీటిని అరికట్టే ప్రయత్నంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. రానున్న రోజుల్లో కుల మతాల ఘర్షణలకు తావివ్వకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. దేశంలోని ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలని, భారతీయులంతా ఒక్కటేనని పిలుపునిచ్చారు. నిరసన ర్యాలీలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యపాల్, పాస్టర్లు పుష్పరాజ్, సుధాకర్, మనోహర్, యేసయ్య, శామ్యూల్, జాన్, సతీష్, మోపూరి ప్రశాంత్ పాల్గొన్నారు.


ఎర్రగుంట్లలో మానవహారంగా ఏర్పడిన క్రైస్తవులు

రాజకీయాలు భావితరాలకు ఆదర్శంగా ఉండాలి


మాట్లాడుతున్న ఉమాదేవి, సాయి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాజకీయాలు భావితరాల వారు ఆదర్శంగా తీసుకునేలా ఉండాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి, ఆయన కుమారుడు సాయి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం వారి నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఓటమి భయంతోనే అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. టిడిపికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు, శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిపై పుంగనూరు వద్ద జరిగిన సంఘటనలో అక్రమ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. మార్చిలో జరిగిన గ్రాడ్యుయేట్స్ ఎన్నికలలో పులివెందులలోనే టిడిపికి ఎక్కువగా రావడంతో వైసిపి వారు జీవించలేకపోతున్నారని తెలిపారు. భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిపై కేసులు కొత్త కాదన్నారు. గతంలో తమపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఇంటిపై కూడా దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని, భయపడే పరిస్థితి లేదని వారన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదు. టిడిపి నేతలపై పెట్టిన కేసులపై న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, తాళ్లపల్లె వెంకటేశ్వరరెడ్డి, పులివెందుల మండల మైనార్టీ నాయకుడు రఫీ పాల్గొన్నారు

భయంతోనే అక్రమ కేసులు

పులివెందుల టౌన్ : వైసిపి ప్రభుత్వం భయంతోనే టిడిపి నాయకులపై కేసులు పెడుతోందని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 4న పుంగనూరులో జరిగిన ఘటన సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మరికొందరు టిడిపి నాయకులపై అక్రమంగా కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. టిడిపి నాయకులపై దాడి జరిగితే వారిపైనే కేసులు పెట్టడం చూస్తుంటే ఇది ప్రజాస్వామ్యమేనా అని అనిపిస్తుందన్నారు.

నూతన విధానంలో కూరగాయల సాగు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పరిసర ప్రాంతాల్లో ఈ ఏడాది నూతన విధానంలో కూరగాయల సాగును రైతులు చేపడుతున్నారు. కూరగాయలు, పూల సాగులో కలుపు గడ్డితో ఇబ్బందులు పడకుండా సాగుకు ముందుగా ప్లాస్టిక్ కవర్‌ను ఏర్పాటు చేసి దాని లోపలి వైపున సాగు నీటి ఏర్పాటుకు డ్రిప్ పైపులను ఏర్పాటు చేశారు. కూరగాయలు, పూల మొక్కలను నాటాల్సిన ప్రదేశంలో రంధ్రాలను ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. విత్తనాలు నాటిన ప్రదేశంలో ప్లాస్టిక్ కవర్ ఉండడంతో కలుపు గడ్డి నివారణ ఏర్పడుతుందని రైతులు పేర్కొంటున్నారు. రైతులు ఈ ఏడాది ఆరుతడి పంటల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది సాధారణ విధానంలో కూరగాయల సాగుకు అనాశక్తి చూపుతున్నారు. కవర్ల విధానంలో బీర, టమోటా, కాకర సాగు చేపడుతున్నారు.


కొత్త పద్ధతితో చేపడుతున్న కూరగాయల సాగు

సుప్రజకు కేంద్ర హోం శాఖ అవార్డు



నందలూరు : గుంటూరు రూరల్ అడిషనల్ ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న నందలూరుకు చెందిన కొర్లగుంట సుప్రజను కేంద్రహోంశాఖ అవార్డుకు ఎంపిక చేశారు. 2023వ సంవత్సరానికి సంబంధించి దేశ వ్యాప్తంగా140 పోలీసులకు కేంద్రం అవార్డులు ఇవ్వనుంది. ఇందులో రెండు తెలుగురాష్ట్రాల నుంచి పది మందిని ఎంపిక చేశారు. ఎపి నుంచి ఐదు మందిని ఎంపిక చేశారు. వీరిలో కొర్లగుంట సుప్రజకు ఈ అవార్డు దక్కనుంది. ఎఎస్‌పి సుప్రజ అవార్డుకు ఎంపిక కావడం పట్ల శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, దర్శకుడు తోట వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మారెమ్మ జాతర

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్‌పంచాయతీ అరవపల్లిలో ముత్తు మారెమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వేప మండలు కట్టి పొంగళ్లను అమ్మవారికి సమర్పించుకున్నారు. జాతరకు వచ్చిన ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రజలందరూ సుఖసం తోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సేలం చంద్రశేఖర్, స్థానిక నాయకులు సేలం సుధాకర్ బాబు, శ్రీరామ్ కిరణ్ కుమార్, ముమ్మడిశెట్టి సుధాకర్ సురేష్ బాబు, నడివీధి సుధాకర్, గుణయాదవ్, ఒర్స్ శ్రీను, పల్లెగ్రీష్మంత్‌రెడ్డి, చలపతి, అఖిల్, భక్తులు పాల్గొన్నారు.


ఎఎస్ఐ సుబ్బన్నను సన్మానిస్తున్న జమాయతే సభ్యులు


ఎఎస్ఐ సుబ్బన్నకు సత్కారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 10న స్థానిక గాంధీ రోడ్డులో కరెంటు షాక్‌తో వర్షపు నీటిలో అపస్మారక స్థితిలో పడి ఉన్న గోల్కొండ జాఫర్ వలిని అటుగా మార్నింగ్ వాక్ వెళుతున్న ట్రాఫిక్ స్టేషన్ ఎఎస్ఐ ఎస్.సుబ్బన్న సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రాణాలను కాపాడారు. అందుకు కృతజ్ఞతగా ఆదివారం స్టేషన్‌లో జమాయతే -ఎ-అహ్లే హదీస్ తరపున సుబ్బన్నను సత్కరించారు. ఈ సందర్భంగా జమాయతే ప్రొద్దుటూరు అధ్యక్షుడు షేక్ సాదిక్ అలీ మాట్లాడుతూ తమ జమాయతే సభ్యుడైన జాఫర్ వలిని కాపాడిన సుబ్బన్నను తాము అంతా అభినందిస్తున్నామని తెలిపారు. తన ప్రాణాలకు తెగించి స్పందించి మానవత్వాన్ని చాటిన ఆయనను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సాటి మనిషి ఆపదలో ఉంటే తప్పనిసరిగా మనం అందరం స్పందించాలని తెలిపారు. జాఫర్‌వలి మాట్లాడుతూ తన ప్రాణాలను కాపాడిన ఎఎస్ఐ సుబ్బన్నకు తాను, తన కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటా మన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ. యుగంధర్, జమాయతే సభ్యులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో ప్రజలపై భారం

ప్రజాశక్తి - ముద్దనూరు


మంగపట్నంలో తిరుగుతున్న భూపేష్‌రెడ్డి

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారం మోపుతున్నారని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మంగపట్నం గ్రామంలో ఆదివారం భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు తెలిపారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. టిడిపి అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, రమణారెడ్డి జగదీష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మోకు నాయుడు, శ్రీధర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, వెంకట రమణ నాయుడు, నాగార్జున నాయుడు, క్రిష్ణంనాయుడు, అంకం నాయుడు, మోహన్‌రెడ్డి, చంద్రమోహన్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ముస్లిం మైనార్టీలకు వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఇన్సాఫ్ కార్యదర్శి షరీఫ్ కోరారు.


మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో నమ్మకం ఉంచి అండగా నిలిచిన ముస్లింలను వైసిపి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలకు ముఖ్యమంత్రి జగన్ తూట్లు పొడిచారన్నారు. ప్రొద్దుటూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, తెలంగాణా తరహాలో ఆంధ్రలో కూడా ఉర్దూ భాషను రెండవ అధికార భాషగా ప్రకటిస్తామని చెప్పారన్నారు. గతంలో ఇస్తున్న పండుగ కానుకలను గాలి కొదిలేశారన్నారు. సచార్, రంగనాథ్‌మిశ్రా కమిటీ నివేదికలను బుట్టదాఖలు చేసిందన్నారు. ముస్లిం విద్యార్థులకు ఉపకారవేతనాలను రద్దు చేసిందన్నారు. ఈ ప్రభుత్వంలో మైనార్టీలపై దాడులు, అక్రమకేసుల బనాయింపులు అధికమయ్యాయని వాపోయారు. ముస్లిం మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన 12శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని షరీఫ్ అన్నారు. ఇన్సాఫ్ నగర సమితి సభ్యులు బాబా ఫకృద్దీన్, మాలిక్, షెక్షావల్లి పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

- యువ నాయకుడు భూమిరెడ్డి సూర్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యువత రాజకీయాల్లోకి రావాలని, యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని యువ నాయకుడు భూమిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం మండలంలోని కల్లూరు, పెన్నానగర్, శ్రీనివాస నగర్ యువకులు భూమిరెడ్డి సూర్య ప్రతాపరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతని రాజకీ యాల్లోకి స్వాగతి స్తున్నానని తెలిపారు. దేశ జనాభాలో యువకుల శాతమే అధికంగా ఉంద న్నారు. రాజకీయాల్లో యువడత కీలకపా త్ర పోషించాలని తెలిపారు. రాబోవు రోజుల్లో యువతకి రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు.



యువకులతో యువనాయకుడు భూమిరెడ్డి సూర్య

రూ.వంద కోట్ల లావాదేవీలు నిర్వహిస్తాం

ప్రజాశక్తి-గాలివీడు

కడప సహకార కేంద్ర బ్యాంక్ రూ.100 కోట్ల లావాదేవుని టార్గెట్ రీచ్ చేస్తామని గాలివీడు డిసిసిబి బ్యాంక్ మేనేజర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మూడు సంవత్సరాల క్రితం ఈ బ్రాంచ్‌కు తాను బదిలీపై రావడంతో రూ.3.8 కోట్లు ఉన్న టర్నోవర్‌ను ఇప్పటికీ రూ. 21 కోట్లల్లో బంగారు రుణాలపైనే ప్రాఫిట్ ఉందన్నారు. ఎల్‌డి రుణాలు, వ్యవసాయ రుణాలు రూ.30 కోట్లు, వంద గ్రూపుల మహిళలకు ఐఎల్‌జి గ్రూపులకు రుణాలు ఇచ్చామని హౌసింగ్ రుణాల పైన 62 కోట్లు ఇచ్చామని బంగారు రుణాల పైన ఎక్కువ రుణాలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో నెంబర్ వన్ బ్యాంకుగా గాలివీడు శాఖ అభ్యున్నతి చెందుతూ ఉందన్నారు. ప్రజలు, వ్యాపారస్తులకు బ్యాంకు సహకారం అందిస్తోందని, తమ సిబ్బంది కృషి వల్ల బ్యాంకు సేవలు ఇంకొంత ప్రజలకు తీసుకోవడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లి : చిన్నవరంపాడు గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం సాంబశివ నాయుడు కుమారుడు పవన్‌కుమార్ నాయుడు లివర్ వ్యాధితో మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల్లో సతమ తమవుతున్న వారి కుటుంబానికి ముక్కా సాయి వికాస్‌రెడ్డి రూ. 50వేల ఆర్థికసాయం చేశారు. అంతేకాకుండా వారి కుటుంబానికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పవన్‌కుమార్ మృతి పట్ల సంతాపంతో పాటు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పాస్ పోర్టు పోయినది

నాపేరు ఎస్. మీనా మాధురి. నేను **7.8.2023** నాడు ప్రొద్దుటూరు పాతబస్టాండ్ సమీపంలోని జిరాక్స్ సెంటర్‌కు పోవుచుండగా నా పాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెం.J7855022. ఈ నెంబరు గల పాస్‌పోర్టు దొరికినచో క్రింది అడ్రస్‌కు చేర్పించగలరు.

మీనా మాధురి, D/o **ఎస్. ప్రతాపుడు,**
26/960-7-1, మిట్టమీద వీధి, ప్రొద్దుటూరు.
సెల్ నెం : 9985517567.